యూరాలజీ..విశేషాభివృద్ధి

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని యూరాలజీ విభాగానికి గత ప్రభుత్వ హయాంలో ఒకరే డాక్టర్. పేరుకు ఒక ప్రొఫెసర్, రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులున్నా ఎప్పుడూ ఒక్కరే ఉండేవారు. ఆ ఒక్క డాక్టరే అన్ని విధులు చూసుకోవాల్సిన పరిస్థితి. ఈ కారణంగా రోగులకు ఆపరేషన్ చేయాలంటే నెలల తరబడి ఆగాల్సిన దుస్థితి. కానీ ఇప్పుడు రోగి ఆసుపత్రిలో చేరిందే ఆలస్యం ఆపరేషన్ చేసేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వైద్య సేవల్లో, సదుపాయాల్లో యూరాలజీ విభాగం సాధించిన ప్రగతికి ఇది నిదర్శనం.

- పెద్దాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు
- యూరాలజీ విభాగంలో రూ.కోటితో కిడ్నీలో రాళ్లు తొలగించే ఇఎస్‌డబ్ల్యూఎల్ మిషన్
- రూ.30 లక్షలతో ఫ్లెక్సిబుల్ యురిత్రోస్కోపి మిషన్
- రూ.20 లక్షలతో సీఆర్మ్ మిషన్ కొనుగోలు
- రెండు పీజీ సీట్లు మంజూరు
- ఒక అసోసియేట్, రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల సంఖ్య పెంపు
- పెరిగిన శస్త్రచికిత్సల సంఖ్య


యూరాలజీ పురుషుల విభాగం


ఓపీలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఇది కదా.. అభివృద్ధి

కర్నూలు (హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని యూరాలజీ విభాగానికి గత ప్రభుత్వ హయాంలో ఒకరే డాక్టర్. పేరుకు ఒక ప్రొఫెసర్, రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులున్నా ఎప్పుడూ ఒక్కరే ఉండేవారు. ఆ ఒక్క డాక్టరే అన్ని విధులు చూసుకోవాల్సిన పరిస్థితి. ఈ కారణంగా రోగులకు ఆపరేషన్ చేయాలంటే నెలల తరబడి ఆగాల్సిన దుస్థితి. కానీ ఇప్పుడు రోగి ఆసుపత్రిలో చేరిందే ఆలస్యం ఆపరేషన్ చేసేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వైద్య సేవల్లో, సదుపాయాల్లో యూరాలజీ విభాగం సాధించిన ప్రగతికి ఇది నిదర్శనం. కర్నూలు(హాస్పిటల్): యూరాలజీ విభాగంలో ఇప్పుడు ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కావడంతో పాటు అన్ని పోస్టులు ఫుల్‌గా వైద్యులతో నిండి ఉన్నాయి. దీంతో పాటు 2020లో రెండు పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఫలితంగా మూడేళ్లలో ఆరుగురు పీజీ వైద్య విద్యార్థులు ఇక్కడ అభ్యసిస్తూ రోగులకు సేవ చేస్తున్నారు. ఫలితంగా ప్రస్తుతం ఆరుగురు సీనియర్, ఆరుగురు జూనియర్ వైద్యులతో కలిపి మొత్తం 12 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. ఫలితంగా అత్యుత్తమ ఫలితాలను యూరాలజీ విభాగం చూపిస్తోంది. గతంలో వారంలో రెండు రోజులు(మంగళ, శుక్రవారాలు) మాత్రమే ఓపీ నిర్వహించేవారు. ఇప్పుడు వారంలో సోమ, మంగళ, గురు, శుక్రవారాలు ఓపీ నిర్వహిస్తున్నారు. ప్రతి ఓపీ రోజున 70 నుంచి 80 మంది రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో యూరాలజీ సమస్యలకు ఆరోగ్యశ్రీ ఉన్నా ఇక్కడి వైద్యులపై నమ్మకంతో నేరుగా ఇక్కడికే వస్తున్న వారూ ఉన్నారు. ఫలితంగా రోగుల రద్దీ పెరగడంతో 20 పడకలున్న ఈ విభాగంలో అనధికారికంగా మరో 20 పడకలను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దాదాపుగా అన్ని శస్త్రచికిత్సలు, చికిత్సలను డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నారు. దీంతో ఇటు రోగులకు రూపాయి ఖర్చులేకుండా చికిత్స జరగడంతో పాటు యూరాలజీ విభాగానికి సైతం ఆరోగ్యశ్రీ ప్యాకేజీ వస్తోంది. తద్వారా ఆ విభాగానికి అవసరమైన పరికరాలు కొనుగోలుకు వీలు కలుగుతోంది.

త్వరలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు

గతంలో ఐదేళ్ల క్రితం ఓర్వకల్లుకు చెందిన ఆంజనేయులు అనే యువకుడికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. మళ్లీ ఇంత వరకు మరో కిడ్నీ ఆపరేషన్ చేయలేదు. అప్పట్లో ఇప్పటిలా వైద్యులు, పీజీలు, అత్యాధునిక పరికరాలు కూడా లేవు. ఇప్పుడు వైద్యులు, వసతులు సమకూరడంతో మళ్లీ కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌లు నిర్వహించేందుకు వైద్యులు సన్నాహాలు మొదలుపెట్టారు. ప్రస్తుతం ఇద్దరు రోగులకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా పూర్తవుతున్నాయి. ఇకపై నిత్యం ఇలాంటి ఆపరేషన్లు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.1.50 కోటితో ఆధునిక పరికరాలు


ఈఎస్‌డబ్ల్యూఎల్ మిషన్

వైద్యుల సంఖ్య పెరగడంతో పాటు యూరాలజీ విభాగంలో అత్యాధునిక వైద్యపరికరాలు సమకూరాయి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే ఉండే కిడ్నీలో రాళ్లను పగులకొట్టే ఈఎస్‌డబ్ల్యూఎల్ మిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూ.1కోటితో ఇక్కడ ఏర్పాటు చేసింది. అలాగే రూ.30 లక్షలతో లేజర్ మిషన్ విత ఫ్లెక్సిబుల్ యురెత్రోస్కోపి పరికరం, రూ.20 లక్షలతో సీఆర్మ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. 1.5 సెంటిమీటర్ సైజున్న కిడ్నీలో రాళ్లను ఈఎస్‌డబ్ల్యూఎల్ ద్వారా పగులగొట్టవచ్చు. ఈ చికిత్స చేయించుకున్న వారికి మత్తు మందు అవసరం ఉండదు. రోగిని అదే రోజు డిశ్చార్జ్ కూడా చేయవచ్చు. అలాగే లేజర్ మిషన్ విత్ ఫ్లెక్సిబుల్ యురిత్రోస్కోపి ద్వారా రెండు సెంటీమీటర్లున్న కిడ్నీలో రాయిని దీని ద్వారా బ్లాస్ట్ చేయవచ్చు. సీఆర్మ్ మిషన్‌ను ఉపయోగించి పీసీఎస్‌ఎల్ పద్ధతిలో వెనుక భాగంలో ఒక సెంటిమీటర్ మేర రంధ్రం చేసి ఎంత సైజున్న రాయిని సైతం కిడ్నీలో నుంచి తొలగించవచ్చు.

ఇక్కడి డాక్టర్లపై నమ్మకంతో వచ్చాము



మాది వెల్దుర్తి. నేను, నా భార్య రేణుక వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నాము. మాకు ముగ్గురు పిల్లలు. రెండో కుమారుడు యోగీశ్వర్(13)కు కిడ్నీ దగ్గర కణితి, హైడ్రోసిల్ వంటి సమస్యలు ఉండటంతో గత నెల 14వ తేదీన ఇక్కడ చేరాము. ముందుగా ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా ఉండటంతో చికిత్స చేసుకుంటూ వచ్చి ఈ రోజు ఆపరేషన్ చేశారు. మరికొన్ని రోజుల్లో హైడ్రోసిల్‌కు ఆపరేషన్ చేస్తామన్నారు. ఇక్కడి డాక్టర్లపై నమ్మకంతో నేరుగా ప్రైవేటుకు వెళ్లకుండా ఇక్కడికే వచ్చాము. –వెంకటేశ్వర్లు, వెల్దుర్తి

మూత్ర సమస్యతో వచ్చాను



నేను వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాన్ని. నాకు ముగ్గురు మగపిల్లలు, ఒక కుమార్తె. ప్రస్తుతం నా వయస్సు 68. కొంత కాలంగా నాకు మూత్రసమస్య ఉంది. మూత్రం రాకపోవడంతో 15 రోజుల క్రితం యూరాలజీ విభాగంలో చేరాను. గత గురువారం మూత్రనాళానికి ఆపరేషన్ చేశారు. ఇప్పుడు కొద్దిగా మూత్రం వస్తోంది. వచ్చినప్పటి నుంచి డాక్టర్లు నన్ను బాగా చూసుకుంటున్నారు. వచ్చిన ప్రతిసారీ బాగా పలకరిస్తున్నారు. డాక్టర్లు పోయాక నర్సులు, సిబ్బంది కూడా బాగా చూసుకుంటున్నారు. ఎలాంటి ఇబ్బంది లేదు. –ఆంజనేయులు, కొండాపురం, సి.బెళగల్

ప్రైవేటు కన్నా మిన్నగా సేవలు



ఈ విభాగానికి ఎక్కువగా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో హైరిస్క్ కేసులన్నీ వెనక్కి పంపిస్తుంటారు. కొన్ని హైదరాబాద్‌కు వెళ్లి వెనక్కి వచ్చి ఎటూ వెళ్లలేక మా వద్దకు వస్తుంటారు. అలాంటి వారికి కాదనుకుండా రిస్క్ తీసుకుని వైద్యం చేస్తుంటాము. దాదాపు ప్రతి కేసూ విజయవంతమవుతుంది. మా వద్ద యువ వైద్యులకు, నైపుణ్యానికి కొదవలేదు. ఫలితంగా ప్రైవేటుకన్నా మిన్నగా సేవలందిస్తున్నాము. –డాక్టర్ సీతారామయ్య, యూరాలజీ హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

క్లుప్తంగా

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం సురక్షితం


చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్):ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం సురక్షితం అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన భూపాల్‌నగర్‌లో జరుగు తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పక ఇవ్వాలని తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశాలు వారి పరిధిలో ని టీకాలు వేయబోవు పిల్లలు, గర్భిణులు వారి అందిరినీ సెంటర్ వద్దకు పిలిపించి వారికి టీ కాలు వేయాలన్నారు. ఆ వివరాలను ఆర్‌సీహెచ్, యూవీన్, హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు అయ్యేటట్లు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గర్భిణీలకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలకు ఐఎఫ్‌ఏ, విటమిన్–ఎ సిరప్‌లను పంపిణీ చేశారు.

సకల దేవతల ప్రతిరూపం గోమాత



కర్నూలు కల్చరల్: సకల దేవతల ప్రతి రూపం గోమాత అని ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. బుధవారం ఎస్‌ఏపీ క్యాంప్ మైదానంలో చాగంటి ప్రవచనం ఏర్పాటు చేశారు. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు 'గోమాత వైభవం'పై చాగంటి ప్రవచనం చెప్పారు. గోవులో ముక్కోటి దేవతలు నిలయమై ఉంటారన్నారు. కలియుగంలో పూజనీయంగా గోమాత రూపాన్ని జగన్మాత కల్పించిందన్నారు. యజ్ఞ యాగాల్లో గోమాతను కచ్చితంగా పూజిస్తారన్నారు. గోవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు నోటీసులు జారీ

కర్నూలు(సెంట్రల్): సర్వ శిక్షాఅభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరితే తొలగించేందుకు నోటీసులు ఇవ్వడం అన్యాయమని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు పేర్కొన్నారు. పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరితే తప్పా అని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సత్యమ్మ, రామయ్య, సోమేశ్వరి, కృష్ణవేణి, యశోద, రాజరావు పాల్గొన్నారు.

కురువల జనాభాను తక్కువ చూపిస్తున్నారు

కర్నూలు(అర్బన్):జిల్లాలో ఐదు లక్షల జనాభా ఉన్న కురువలను కొన్ని బీసీ కులాలు కేవలం లక్ష జనాభా ఉందని తప్పుడు లెక్కలు చూపించి రాజకీయంగా దూరం చేస్తున్నారని జిల్లా కురువ సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేశా రు. ప్రభుత్వం వద్ద వివిధ కులాలకు సంబంధించి లెక్కలు లేకపోవడం వల్ల తమ కుల జనాభా విషయంలో ఇష్టానుసారం మాట్లాడుతున్నారని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి బుధవారం ఒక ప్రకటనలో ఆరో పించారు. ప్రధానంగా పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో దాదాపు ఐదు లక్షల జనాభా ఉందన్నారు. ఇప్పటి వరకు తమ మంచితనాన్ని చేతకానితనంగా చూస్తున్నారన్నారు. తమను ఖాతారు చేయని పార్టీలను కాదని, స్వతంత్ర అభ్యర్థులకు లేదా నోటా ఖాతాలో తమ ఓట్లు చూపిస్తామన్నారు.

గొర్రెల సహకార సంఘాలు అభివృద్ధి చెందాలి


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సహకార మేనేజ్‌మెంటు సంస్థ ఏపీ కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాలలో ప్రాథమిక సహకార గొర్రెల పెంపకందారుల సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సంఘాలు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు తీర్మానాలను రికార్డుల్లో పకడ్బందీగా నమోదు చేయాలని పేర్కొన్నారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుంచి తీసుకున్న రుణాలను గడువులోపు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెల అభివృద్ధి విభాగం ఏడీ సుభాన్‌బాషా, వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

22న అయోధ్య రామాలయ సంబరాలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన కర్నూలులో అయోధ్య రామాలయ సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు, కె.క్రిష్టన్న పేర్కొన్నారు. బుధవారం సీక్యాంప్ టీ జీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంబరాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్యలో జరుగు శ్రీ బాలరాముల వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలులో సీతారాముల వారి శోభాయాత్ర, పట్టాభిషేక మహోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అయోధ్య రామాలయానికి కర్నూలుకు అవినాభావ సంబంధం ఉందన్నారు. అయోధ్య కేసును వాదించేందుకు అయ్యే వ్యయాన్ని జిల్లాకు చెందిన జి.పుల్లారెడ్డి సమకూర్చారన్నారు. అదే విధంగా కర్నూలు సంఘ్ కార్యకలాపాల్లో కీలకంగా ఉన్న వ్యక్తులు ప్రస్తుతం అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగస్వాములుగా ఉన్నారన్నారు. ఉదయం 10 గంటలకు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో సీతారాముల వారి కల్యాణం, మధ్యాహ్నం 1 గంటకు అక్కడి నుంచే శ్రీరాముల వారి విగ్రహంతో శోభయాత్ర ప్రారంభమై నగరంలోని పురవీధుల గుండా ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు సాగుతుందన్నారు. ఎగ్జిబిషన్ మైదానంలో నమూనా అయోధ్య రామాలయం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి నాగోజిరావు, కార్యదర్శి నటేష్ కుమార్, ఉపాధ్యక్షులు మహాబలేష్, చల్లా దామోదర్‌రెడ్డి, కోశాధికారి కల్కి మురళి, సభ్యులు గోపీనాథ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య పవిత్ర అక్షింతల వితరణ

అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలను బుధవారం రాగమయూరి గ్రీన్ ల్యాండ్‌లో పంపిణీ చేశారు కాలనీలోని పెద్దలందరూ జై శ్రీరాం జైజై శ్రీరాం అని నినాదాలు చేస్తూ స్థానిక హిందూ కుటుంబాలకు అక్షింతలు, అయోధ్య నమూనా చిత్రం, ఆహ్వాన పత్రం అందించారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ కర్నూలు జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 22 వ తేదీన శ్రీరామ జన్మభూమి అయోధ్యలో జరిగే భగవాన్ రామ్ లల్లా విరాజ్‌మాన్ (బాలరాముడు) మహాప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంలో ప్రతి ఇంటినీ సుందరంగా అలంకరించి పూజలు చేయాలన్నారు. 108 సార్లు 'శ్రీరామ జయజయ జయజయ రామ' అన్న విజయ మహామంత్ర జపం, హనుమాన్ చాలీసా ఐదుసార్లు పారాయణం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా నాయకులు నాగిరెడ్డి, బీజేపీ నాయకులు మద్దిలేటి రెడ్డి పాల్గొన్నారు.

సేఫ్ కస్టడీ ఆర్టికల్స్‌ను తీసుకెళ్లండి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ కార్యాలయంలో భద్రపరిచిన సేఫ్ కస్టడీ ఆర్టికల్స్‌ను సత్వరం తీసుకెళ్లాలని జిల్లా ట్రెజరీ ఉప సంచాలకులు రామచంద్రరావు వివిధ శాఖల అధికారులకు నోటీసులు ఇచ్చారు. జిల్లా ట్రెజరీలోని స్ట్రాంగ్‌రూమ్‌లో వివిధ శాఖలకు చెందిన అపురూప వస్తువులు, విగ్రహాలు, పూరతన వస్తువులు, నాణేలు ఇలా అనేక వస్తువులను సేఫ్ కస్టడి ఆర్టికల్స్ కింద భద్రపరుస్తారు. నిబంధనల ప్రకారం వీటిని మూడేళ్లలో సంబంధిత అధికారులు తీసుకెళ్లాల్సి ఉంది. మూడేళ్లు గడచినప్పటికి తీసుకెళ్లపోలేదు. మరో మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నేపథ్యంలో పాత వాటిని తీసుకెళ్లే విధంగా ప్రభుత్వం ఇప్పటికే జీవో ఆర్‌టీ నెంబరు 135 జారీ చేసింది. ఎన్నికలు జరుగుతున్నందున కొత్త వాటిని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచేందుకు... పాతవాటిని తీసుకెళ్లే విధంగా ఇటీవలనే జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా ట్రెజరీ అధికారులు మున్సిపల్ కమిషనర్, పోలీసు, రెవెన్యూ, ఏపీఎస్‌పీ బెటాలియన్, ఎన్‌సీసీ, ఎక్సైజ్, ఇరిగేషన్, జెడ్పీ అధికారులకు నోటీసులు ఇచ్చారు.

జల్లబాబుకు నివాళి

కర్నూలు కల్చరల్: కళామ్మతల్లి ముద్దుబిడ్డ కళాకారుడు పగడాల జల్ల బాబు సంస్మరణ సభను బుధవారం కర్నూలు నగరంలోని మార్కెట్ యార్డులో నిర్వహించారు. విశ్వ కళాసమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హనుమాన్ కళాసమితి అధ్యక్షుడు పి.హనుమంతరావు చౌదరి, కర్నూలు కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షుడు బైలుప్పల షఫీయుల్లా, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బసవరాజు, సంగీత గురువులు పీజీ వెంకటేశ్వర్లు పాల్గొని జల్లబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వ కళా సమితి అధ్యక్షుడు బీసన్న , కళాకారులు లక్ష్మణరాజు, నాగరాజు, శ్రీనివాసులు, చిన్నికృష్ణ, బాల మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార దుకాణాల్లో తనిఖీలు

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని 30 వ్యాపార, వాణిజ్య దుకాణాలపై తనిఖీలు చేపట్టినట్లు తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్ కుమార్ తెలిపారు. బుధవారం నగరంలోని వివిధ వాణిజ్య వ్యాపార దుకాణాల్లోని తూకాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకాల్లో తేడాలొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని పెయింట్‌షాపులో పెయింట్ బకెట్‌పై ఎంఆర్‌పీ, తయారీతేది లేకపోవడంతో కేసు నమోదు చేశామన్నారు.

చిన్నారి గుండెచుట్టూ అరలీటర్ చీము

- ఆరోగ్యశ్రీ ద్వారా ప్రాణాలు కాపాడిన కిమ్స్ వైద్యులు


కోలుకున్న బాలునితో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): నాలుగేళ్ల బాబుకు గుండెచుట్టూ అరలీటర్ మేర చీము పేరుకపోయి ఊపిరి తీసుకోవడం కష్టంగా మారింది. అతనికి కర్నూలు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తి ఉచితంగా అత్యాధునిక చికిత్స చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ఈ వివరాలను ఆసుపత్రికి చెందిన చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ భరత్‌రెడ్డి, ఐసీయూ స్పెషలిస్టు డాక్టర్ నవీన్‌రెడ్డి, డాక్టర్ వాసు, డాక్టర్ రవి వెల్లడించారు. 'కర్నూలుకు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాబుకు జ్వరం, ఆయాసం రావడంతో కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. బాబు విషమ పరిస్థితి గమనించిన వైద్యులు వెంటనే పీఐసీయూలో చేర్చారు. అవసరమైన మందులు, చికిత్స చేసినా కోలుకోలేదు. దీంతో 2 డీ ఎకో పరీక్ష చేయగా గుండె చుట్టూ చీము చేరిందని గుర్తించారు. దీంతో యూఎస్‌జీ స్కాన్ సాయంతో గుండెచుట్టూ ఉన్న చీమును బయటకు తీసేందుకు ఒక చిన్న పైపును గుండెలోకి అమర్చి గట్టిగా తాడులా ఏర్పడ్డ ఆ చీము కరగడానికి ఒక ఇంజెక్షన్ ఇచ్చి రెండు రోజుల్లో అరలీటర్‌పైగా చీమును బయటకు తీశారు. బాబుకు మళ్లీ ఆయాసం ఎక్కువ కావడంతో స్కానింగ్ చేసి క్షుణ్ణంగా పరీక్షించి కుడివైపు ఊపిరితిత్తుల చుట్టూ చీము ఉందని గుర్తించారు. దానికి శస్త్రచికిత్స అవసరం కావడంతో వెంటనే పిల్లల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ సాయంతో ఆపరేషన్ చేసి చీము తొలగించారు. ప్రస్తుతం బాబు పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశామ' ని వారు తెలిపారు. శరీరంలో ఎక్కడ ఇన్‌ఫెక్షన్ వచ్చినా సెప్సిస్ అనే ప్రమాదకర వ్యాధి రావడానికి అవకాశం ఉందన్నారు. దీనివల్ల శరీరంలో అవయవాలు దెబ్బతింటాయని, సకాలంలో గుర్తించి మెరుగైన వైద్యం అందిస్తే కోలుకునే అవకాశం ఉందన్నారు.

అవీ-ఇవీ

13న కవి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలుగు సారస్వత వైభవం సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. ఏపీ ప్రభుత్వ తెలుగు భాష సేవ పురస్కార గ్రహీతలు ఆకాశ వాణి విశ్రాంత వ్యాఖ్యాత డాక్టర్ వి.పోతన్న, ఉస్మానియా కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ మండి అన్వర్ హుసేన్, విశ్రాంత తెలుగు ఆచార్యులు డాక్టర్ ఆదవాని హనుమంతప్పలకు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు.

వేతనాలు పెంచే వరకు సమ్మె

కర్నూలు(సెంట్రల్): వేతనాలు పెంచే వరకు సమ్మె ను ఆపేదిలేదని అంగన్‌వాడీలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 30వ రోజు శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వరలక్ష్మి, సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండఅంజిబాబు, ఎస్ మునెప్ప, చంద్రశేఖర్, ఐఎఫ్‌టీయూ నరసింహులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పనిచేసే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్‌ఆర్ టీయూసీ అధ్యక్షుడు రమణ ప్రభుత్వానికి విన్నవించారు. బుధవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు స్థానిక రాజ్‌విహార్ నుంచి కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు.

సిల్వర్‌జూబ్లీ విద్యార్థినికి అభినందనలు

కర్నూలు సిటీ:క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ సెకెండ్ ఇయర్ విద్యార్థిని జ్యోతి యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 9 వరకు గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో బుధవారం ఆ విద్యార్థినిని కాలేజీ ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ అభినందించారు. జానపద గీతం అంశంలో జాతీయస్థాయి యువజనోత్సవాల పోటీలకు జ్యోతి అర్హత సాధించిందన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి

కర్నూలు(సెంట్రల్) : రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లను విడుదల చేయాలని , పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా వినూత్నంగా ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని కోరుతూ చెప్పులు కుదుతూ నిరసన తెలిపారు.

స్పోర్ట్స్

రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలి


జిల్లా హ్యాండ్‌బాల్ జట్టును అభినందిస్తున్న ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): ఈనెల 12, 13 తేదీల్లో రాజంపేట పట్టణంలో నిర్వహిస్తున్న 45 వ రాష్ట్ర స్థాయి బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు ఆకాంక్షించారు. రాష్ట్ర పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును బుధవారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ప్రకటించారు. ఎస్.స్వాతి, వీణకుమారి, గీతా, కళ్యాణి, జ్యోతి, నందిని, తనిష్క, లక్ష్మీ, మంజూషా, జ్యోతిక, ఇందుప్రియ, జెస్సీ ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి సువర్ణ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో అవసరం


క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): నేటి సమాజంలో బాలికలకు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు అవసరమని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అన్నారు. ఈనెల 7 వ తేదీ నంద్యాల పట్టణంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను టీజీ తన నివాసంలో అభినందించారు. క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి

కర్నూలు (టౌన్): ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ విజయమనోహరి అన్నారు. బుధవారం స్థానిక బాలాజీనగర్‌లో బుజుగు రవిపతిల జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం – ఆంధ్ర పేరుతో 50 రోజుల క్రీడల పండుగను ప్రారంభించారన్నారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, టీషర్టులు, క్యాప్‌లు అందజేస్తున్నారన్నారు. ప్రతిభ చాటే క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తాలూకా సీఐ శ్రీరామ్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు హనుమంతరెడ్డి, శివచరణ్ సింగ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

104 ఎంఎంయూ సేవలను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి


కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్) : 104 సర్వీసులను ప్రభుత్వమే నేరుగా పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని 104 ఎంఎంయూ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్‌కు కర్నూలులో వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..డీఎస్సీ, ఆర్‌ఓఆర్ ప్రకారం సుదీర్ఘ కాలంపాటు సేవలందిస్తున్న 326 మంది 104 డ్రైవర్లను ఇతర శాఖల్లో రెగ్యులర్‌గా నియమించాలన్నారు. లేకపోతే కనీసం ఆప్కాస్‌లో కలపాలని కోరారు. కాగా, 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 22 నుంచి ఆందోళన చేపట్టనున్నట్లు వారు వివరించారు.